ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- ప్రజావాణిలో 17 అర్జీలు స్వీకరణ

సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్, పక్కన అదనపు కలెక్టర్, తదితరులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 16: ప్రజా వాణిలో ప్రజలు సమస్యలపై ఇచ్చే అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో 17 అర్జీలు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొడుకు తిండి పెట్టడం లేదు

మాది జగిత్యాల లోని గోవిందుపల్లె. తమకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు తమకు తిండి పెట్టడం లేదు. రోజు చిత్రహింసలు పెడుతున్నడు. అనారోగ్యంతో బాధపడుతుండగా డాక్టర్ వద్దకు తీసుకెళ్లడం లేదని, కనీసం మందు గోలీలు అయినా తేవాలంటే ఎండ్రిన్ గోళీలు తేస్తా, అవి తిని చనిపోవాలని కొడుకు దూషిస్తున్నాడు. తమ పేరిట ఉన్న 57 గుంటల విలువైన భూమిని కొడుకు తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకొని మా బాగోగులు చూడడం లేదు. భూమి తిరిగి తమ పేరిట పట్టా చేయించాలని, ఆ భూమిని అనాథశ్రమానికి రాసిచ్చి, తాము వృద్ధాశ్రమంలో ఉంటామని కలెక్టర్‌ను రోదిస్తూ వేడుకున్నారు.

-ముల్లె నారాయణ-రాజవ్వ

రైతులపై కక్ష సాధింపు సరికాదు

కాంగ్రెస్ సర్కారు రైతులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా రైతుబంధు, పంట రుణమాఫీ రైతులకు సక్రంగా అందలేదు. తొంబర్రావుపేటలో 90 మందికిపైగా, వర్షకొండలో 50 మంది రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ కాలేదు. సన్న వడ్లకు బోనస్ కూడా సరిగ్గా అందడం లేదు. మూడు పంటలు పూర్తయినా రైతులకు రైతుభరోసా అందలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష పంట రుణ మాఫీ చేసింది. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల పంట రుణమాఫీ చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

-తొంబర్రావుపేట (మేడిపల్లి మండలం), వర్షకొండ (ఇబ్రహీంపట్నం మండలం) రైతులు

దుబాయ్‌లో బస్సు బోల్తా

- దమ్మన్నపేట వాసి మృతి, మరొకరికి గాయాలు

మేడిపల్లి, డిసెంబర్ 16: దుబాయ్‌లో 84 మందితో ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదవశాత్తు బోల్తాపడిన ఘటనలో 12 మంది మృతి చెందగా, మిగిలిన వారికి గాయాలైనట్లు దుబాయ్‌లో ఉన్న స్థానికులు సోమవారం తెలిపారు. ఇందులో మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన శేరు ఎర్రయ్య అలియాస్ శేరు ఎర్రన్న మృతి చెందగా, గాజుల గంగరాజంకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... శేరు ఎర్రన్న, గాజుల గంగరాజం పదేళ్లుగా దుబాయ్‌కి వెళ్లి వస్తున్నారు. ఇద్దరు అక్కడ దర్వీస్ ఇంజినీరింగ్ ఎమిరేట్స్ కంపెనీలో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కంపెనీ జీతం ఇవ్వడంతో వారి క్యాంపు పూజీరా సమీపంలోని కుర్‌ఫాఖాన్ నుంచి అజ్మాన్‌కు దర్వీస్ కంపెనీ బస్సులో వెళ్లారు. అక్కడి నుంచి జీతం డబ్బులను ఇంటికి పంపి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం పని ముగించుకొని బస్సులో అజ్మాన్ నుంచి కుర్‌ఫాఖాన్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. కొద్ది నిమిషాల్లో వారి క్యాంపు కుర్‌ఫాఖాన్ వస్తుందనే సమయంలోనే గుట్ట దిగుతుండగా బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో శేరు ఎర్రన్న మృతి చెందగా, గాజుల గంగరాజంకు గాయాలయ్యాయి. ఎర్రన్నకు భార్య లక్ష్మి, కూతుళ్లు శిరీష, వైష్ణవి, వర్షిణి ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించుకొని ఎర్రన్న మృతదేహం త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విచారణ చేపట్టాలి

సారంగాపూర్, డిసెంబర్ 16: కోనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు సంఘ సభ్యులు పలువురు ఫిర్యాదు చేశారు. సంఘ చైర్మన్‌గా గురునాథం మల్లారెడ్డి ఎన్నికైన నాటి నుంచి తమకు సంఘం లావాదేవీల లెక్కలు చెప్పలేదని, మా అనుమతి లేకుండా సంఘం సేవింగ్ ఖాతా నుంచి పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని సొంతానికి వాడుకున్నారని విన్నవించారు. సంఘం ద్వారా అమ్మిన ఎరువుల డబ్బులు రూ. 4 లక్షలు బ్యాంకులో చెల్లించకుండా తన సొంతానికి వాడుకున్నారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

జగిత్యాల, డిసెంబర్ 16: సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఎస్టీయూ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ డిమాండ్ చేశారు. జగిత్యాలలో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్ష శిబిరంలో సోమవారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మచ్చ శంకర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వెంటనే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్, రిటైర్డ్ ఎంఈవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తూ అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సోమవారం జగిత్యాలలోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అన్ని విభాగాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రేవతిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు

మాజీ ఎంపీపీని పరామర్శించిన చల్మెడ

కథలాపూర్, డిసెంబర్ 16: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి భర్త గణేశ్ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు రాఘవరెడ్డి, శేఖర్, కిరణ్‌రావు, సాగర్‌రావు, తిరుపతి, రవీందర్, సాయన్న, నాగమల్లేశం, రాజేశ్, ప్రశాంత్, తిరుజానీ, రామాంజనేయులు, ముజీబ్, అజిత్‌రావు ఉన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

మల్లాపూర్, డిసెంబర్ 16: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి తరలి వెళ్తున్నారనే సమాచారంతో ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున పలు గ్రామాల్లోని మాజీ సర్పంచులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక్కడ మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మైదాస్ శ్రీనివాస్, మాజీ సర్పంచులు వనతడపుల నాగరాజు, కుందేళ్ల నర్సయ్య, అలిశెట్టి రవి, తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు

ఏసీబీకి చిక్కిన డీఎఫ్ఆర్‌వో

- మామిడి చెక్కల తరలింపునకు లంచం డిమాండ్
- రూ.4,500 తీసుకుంటుండగా పట్టివేత

ఏసీబీ అధికారులకు పట్టుబడిన డీఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్

మెట్‌పల్లి, డిసెంబర్16 : మామిడి కట్టెలు (చెక్కలు) ట్రాన్స్‌పోర్టు కోసం ఎన్‌వోసీ ఇచ్చేందుకు లంచం తీసుకుంటుండగా అటవీశాఖలోని జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డిప్యూటీ రేంజ్ అధికారి మహ్మద్ హఫీజుద్దీన్ సోమవారం సాయంత్రం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లపు నరేశ్ అనే ప్రైవేట్ డ్రైవర్ కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారులోని ఓ తోట నుంచి మామిడి చెట్లనరికివేతకు ఆన్‌లైన్ అనుమతి తీసుకున్నాడు. కోసిన కట్టెలను వాహనంలో కామారెడ్డి పట్టణానికి రవాణా చేసేందుకు అవసరమైన ఎన్‌వోసీ (నిరభ్యంతర ధృవపత్రం) కోసం సంబంధిత కథలాపూర్ మండలానికి ఇన్‌చార్జిగా ఉన్న మెట్‌పల్లి డీఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్‌ను పది రోజుల కిందట సంప్రదించాడు. అయితే, తనకు రూ.10 వేలు లంచం ఇస్తేనే ఎన్‌వోసీ ఇస్తానని, లేకపోతే ఇవ్వనని స్పష్టం చేయడంతో ఈ నెల 13న రూ.5 వేలు ఇచ్చి ఒక లోడ్ తరలించాడు. రెండో లోడ్ కోసం ఎన్‌వోసీ ఇచ్చేందుకు మళ్లీ మరో రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో అంత ఇవ్వలేనని బతిమిలాడుకోగా, అందులో నుంచి రూ.500 తగ్గించి రూ.4500 ఇవ్వాలని, ఇస్తేనే ఎన్‌వోసీ ఇస్తానంటూ ఇబ్బందిపెట్టడంతో నరేశ్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ క్రమంలో ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేట సమీపంలో డీఎఫ్ఆర్‌వో నివాసం ఉంటున్న అద్దె ఇంటిపై నిఘా పెట్టారు. బాధితుడి నుంచి రూ.4500 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. రసాయన పరీక్షలో రెండు చేతుల వేళ్లు, నోట్లపై వేలి ముద్రలు నిర్ధారణ కావడంతో నోట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి హఫీజుద్దీన్‌ను అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

విసుగు చెంది ఏసీబీని ఆశ్రయించా

ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకుని కాలం చెల్లిన మామిడి చెట్లను కోశాం. దాని చెక్కలను కామారెడ్డికి పట్టణానికి ట్రాన్స్‌పోర్టు కోసం ఎన్‌వోసీ అవసరం కావడంతో డీఎఫ్ఆర్‌వోను సంప్రదించా. దీనికి రూ.10 వేలు లంచం అడిగిండు. అంత ఇవ్వలేనని, తనతో కాదని రూ.5 వేలు ఇచ్చిన. మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో విసుగుచెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించా.

'పియస్టెవా' శిఖరంపై సూర్య నమస్కారాలు

- వెల్లుల్ల యువకుడు ప్రవీణ్ ఘనత


'పియస్టెవా' శిఖరంపై సూర్య నమస్కారం చేస్తున్న ప్రవీణ్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 16: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫినిక్స్ నగర శివారులోగల 'పియస్టెవా' శిఖరాన్ని అధిరోహించి, సూర్య నమస్కారాలు చేశాడు. ప్రవీణ్ ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తూ, అక్కడ అసాధారణ ఉష్ణోగ్రతల వద్ద సూర్య నమస్కారాలు చేస్తూ యోగా శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అరిజోనా కాలమానం ప్రకారం డిసెంబర్ 15న 2.4 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేస్తూ రాతితో కూడిన పియస్టెవా శిఖరంపైకి చేరుకున్నాడు. అక్కడ 2,610 అడుగుల ఎత్తులో తొమ్మిది డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 22.37 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలను పూర్తి చేశాడు. కాగా, ఇప్పటి వరకు ప్రవీణ్ 48 ఎత్తైన పర్వతాలను అధిరోహించి 108 సూర్య నమస్కారాలను ప్రదర్శించడం విశేషం.

ఆర్థిక సాయం

మేడిపల్లి, డిసెంబర్ 16: భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన పడాల గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న దోసిలి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి దవాఖానకు వెళ్లి పరామర్శించారు. రూ. 15 వేల నగదు అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కుమార్, మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్, నాయకులు జలంధర్‌రెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

జగిత్యాల, డిసెంబర్ 16: జిల్లాలో ఆది, సోమవారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో 10,907 మంది అభ్యర్థులకు గానూ మొదటి రోజు రెండు సెషన్లలో పరీక్షకు 10,496 మంది హాజరయ్యారు. రెండో రోజు రెండు సెషన్లలో 10,319 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ బీ సత్యప్రసాద్ తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, తదితరులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 16: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో సోమవారం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లో రాణించడం వల్ల శారీరక ధృఢత్వం, మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మంచి భావనలు మెరుగుపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవోలు వాసం భీమయ్య, గాయత్రి, డిప్యూటీ ఎస్‌వో రవికుమార్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు చుక్క నవీన్, చెట్‌పల్లి సుధాకర్, పీఈటీలు విషు ప్రసాద్, అజయ్, కృష్ణప్రసాద్, కోటేశ్, వేణు, శశి, విజ్ఞాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా బల్కం మల్లేశం

కొడిమ్యాల, డిసెంబర్ 16: బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేటకు చెందిన బల్కం మల్లేశం యాదవ్ నియామకమయ్యారు. అలాగే, ఉపాధ్యక్షుడిగా బిడుదుల లక్ష్మణ్, నియోజకవర్గ ఇన్‌చార్జిగా చిర్ర శంకర్ నియమితులయ్యారు.

18న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ పర్యటన

జగిత్యాల రూరల్, డిసెంబర్ 16: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డా. శమీం అక్తర్ ఈనెల 18న కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయానికి రానున్నారని జగిత్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషన్ చైర్మన్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి షెడ్యూల్డ్ ఉప కులాల వర్గీకరణపై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే, బహిరంగ చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

- సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పాటపాడుతూ నిరసన

నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల, డిసెంబర్ 16 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మోసం చేసి అధికారంలోకి వచ్చిన తీరును వివరిస్తూ జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన గంగమ్మ పాడిన పాట సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు ఇవ్వాలని కోరారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నట్లు చెప్పారు. గతంలో చేసిన వాటికే బిల్లులు రాలేదని, పైగా రాగి జావ పోయాలని, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లోని కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారని, అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోయారు. పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదని, కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇచ్చే జీతమే తక్కువ అని, అది కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని, రాగి జావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారని, గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ 2 గుడ్లకే సరిపోదని, 3 గుడ్లు ఎలా పెట్టాలని ప్రశ్నించారు. గుడ్లకు అదనం బడ్జెట్ కేటాయించాలి లేదా అంగన్వాడీ సెంటర్స్కి సప్లయ్ చేసినట్లుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లయ్ చేయాలని, రాగి జావ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని, కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న బోజన కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం కలిసి కట్టుగా పోరాడాలి

కొడిమ్యాల, డిసెంబర్ 16: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, ఉప కులాల వారంతా కలిసి కట్టుగా పోరాడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీను(జగన్), మాదిగ జేఏసీ మండల నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని మాదిగ కుల సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీలను ప్రకటించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీను మాట్లాడుతూ, సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు అధికారాలు అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ మండలాధ్యక్షుడు పర్లపల్లి ప్రసాద్, నాయకులు సురుగు శ్రీనివాస్, ఎలగుర్తి రవీందర్, బోనగిరి లక్ష్మీనర్సయ్య, నేరేళ్ల మహేశ్, బండపల్లి అంజన్‌కుమార్, కోలపురం రమేశ్, కొత్తూరి స్వామి, బండారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నాచురోపతి వైద్య శిబిరం

మెట్‌పల్లి, డిసెంబర్ 16: పట్టణంలోని వాసవీమాత ఆలయ ఆవరణలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన నాచురోపతి ఉచిత వైద్య శిబిరాన్ని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి ప్రారంభించారు. ఏడు రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. వైద్యులు మహేంద్రసింగ్, గోస్వామి వైద్య సేవలందించారు. మొదటి రోజు 150 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు, సంఘం నాయకులు చాడ సురేశ్, కోట కిరణ్‌కుమార్, కొత్త కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద యువతుల వివాహానికి ఆర్థిక చేయూత

జగిత్యాల, డిసెంబర్ 16: మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన గాజూరి అశ్విని, రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన అట్కాపురం ప్రవళిక, జగిత్యాలకు చెందిన పేరాల నిఖిత వివాహం నిశ్చయమైంది. కాగా, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు గోగుల శశిధర్-దీప్తి, పూటూరి భాస్కర్-గంగ, వడ్ల మురళి-సుమ, గుండ రాజశేఖర్-అర్చన, చిటుమల్ల లక్ష్మీనారాయణ-జయశ్రీ, డారపు శ్రీనివాస్-శైలజ, బట్టు రాజేందర్-శ్రీలత పుస్తె మట్టెలు, పెండ్లి చీర, మంగళ హారతి సెట్, ఇతర సామగ్రితో పాటు 25 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు బట్టు రాజేందర్, ఎర్ర సత్తయ్య, గుండ రాజశేఖర్, పూటూరి భాస్కర్, గోలి రాజేశ్వర్ రెడ్డి, అమనగంటి నాగభూషణం, మామిడాల చంద్రయ్య, గందె శ్రీకాంత్, గట్టు రాజేందర్, గూడూరు మురళీధర్ రావు, జైశెట్టి రాజ్ కిషన్, ఠాకూర్ నారాయణ్ సింగ్, రాజశేఖర్, జయశ్రీ, శ్రీలత, అర్చన పాల్గొన్నారు.

జగిత్యాల, డిసెంబర్ 16: పెగడపల్లి మండలం శాలపల్లె గ్రామానికి చెందిన ఆడెపు శ్రీనివాస్-లత దంపతుల కూతురు లోహిత వివాహం నిశ్చయం కాగా, శ్రీభక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు రూ.10 వేలు అందజేశారు. అలాగే, గీతా సిల్క్ హౌస్ యజమాని కస్తూరి శశిధర్ పట్టు చీర అందించారు. ఈ కార్యక్రమంలో మానపూరి శ్రీనివాస్, శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కొక్కుల సుదర్శన్, కోమాకుల సుదర్శన్, వేముల శంకర్, పద్మశాలీ సేవా సంఘం డైరెక్టర్ జోగ మల్లేశం, మాచర్ల శంకర్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

కోరుట్ల, డిసెంబర్ 16: పట్టణంలోని శ్రీనివాసరోడ్డులో గల విశ్వబ్రాహ్మణ సంఘంలో సోమవారం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పవన్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా శ్రీధర్ ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఇక్కడ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, ఈశ్వర్, రవి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధం, గొర్రెలు మృతి

వెల్గటూర్, డిసెంబర్ 16: వెల్గటూర్ మండలం స్తంభంపల్